
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 15 డిసెంబరు 2024



రేపటి నుంచి జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు ఈ నెల 16 నుంచి 21వ తేదీవరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ ఖాసీంబేగ్, సూపరింటెండెంట్ జావిద్అలీ, తహసీల్దార్ దేవదాస్, పీడీ, పీఈటీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్కారు బడి పిల్లల ఆటవిడుపు

విద్యతో పాటు పిల్లలకు ఆటవిడుపూ ముఖ్యమనే ఉద్దేశంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామగ్రి ఏర్పాటుకు నిధులను మంజూరు చేశారు. నియోజకవర్గానికి రెండు చొప్పున 10 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.1.18 లక్షల చొప్పున కేటాయించారు. సంగారెడ్డి పాఠశాలలో ఇటీవలే క్రీడా పరికరాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఉత్సాహంగా ఆడుకుంటున్నారు.

-సంగారెడ్డి అర్బన్, (ఆంధ్రజ్యోతి)

రుద్ర యంత్రం.. సాగు మంత్రం

- రాళ్లను ఏరివేసే యంత్రాన్ని రూపొందించిన బోరంచ యువకుడు
- నాలుగు గంటల్లోనే ఎకరం భూమిలో రాళ్ల తొలగింపు

7



- ఖర్చు తక్కువ.. కూలీల అవసరం లేదు
- బీడు భూమలను సాగుకు యోగ్యంగా మారుస్తున్న యంత్రం



నాగ్‌పూర్‌లో నిర్వహించిన ప్రదర్శనలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి వివరిస్తున్న దీపక్‌రెడ్డి



వైభవంగా దత్తాత్రేయ జయంతి

ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో దత్తయజ్ఞం నిర్వహిస్తున్న ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరిమహరాజ్

8



సండేస్పెషల్

ప్రకృతి రమణీయం

పోచారం అభయారణ్యం

- అరుదైన వన్యప్రాణులకు నిలయం
- పర్యాటకులను ఆకట్టుకునే అటవీ అందాలు
- జలపాతాన్ని తలపించే ప్రాజెక్టు అలుగు
- అందుబాటులో సఫారీ రైడ్
- ప్రత్యేక విశ్రాంతి భవనం

ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే పచ్చని వనాలు.. చెంగుచెంగున దూకే లేడిపిల్లలు.. పురివిప్పి నాట్యం చేసే నెమళ్లు.. గుర్రాలను తలపించేలా పరుగు తీసే నీల్‌గాయ్‌లు, సాంబార్లతోపాటు అరుదైన వన్యప్రాణులు, పక్షులు.. పక్కనే జలపాతాన్ని తలపించే ప్రాజెక్టుతో పర్యాటకులను ఆకట్టుకుంటున్నది పోచారం అభయారణ్యం. ఈ అందాలను తిలకించేందుకు వీకెండ్‌లో పర్యాటకులు తరలివస్తుంటారు.

-హవేళిఘణపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

హైదరాబాద్ నగరానికి 110 కిలోమీటర్లు, మెదక్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో.. మెదక్- కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్నాయి పోచారం అభయారణ్యం, ప్రాజెక్టు. 650 ఎకరాల్లో విస్తరించిన అడవి ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా నిలుస్తుంది. ఈ అభయారణ్యంలో పాతికేళ్ల క్రితమే జింకల ప్రత్యుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వారాంతాలు, సెలవు రోజుల్లో పరిసర ప్రాంతాలతో పాటు, హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అధికారిక లెక్కల ప్రకారం అభయారణ్యంలో ఆరువందలకు పైగా జంతువులున్నాయి. వాటిల్లో జింకలు, నీల్‌గాయ్‌లు, సాంబర్లు, నెమళ్లు, అడవిపందులు, దుప్పులతో పాటు ఇతర రకాల వన్యప్రాణులు, పక్షులు సంచరిస్తాయి. అడవి చుట్టూ ఇనుప కంచె వేసి అందులోంచి జంతువులు బయటకు రాకుండా రక్షణ కల్పిస్తున్నారు. మేత కోసం ప్రత్యేకంగా గడ్డిని పెంచుతున్నారు.

వాచ్‌టవర్లు, సఫారీ రైడ్

ప్రకృతి అందాలను తిలకించేందుకు అభయారణ్యంలో రెండు వాచ్‌టవర్లను ఏర్పాటు చేశారు. వీటి పైనుంచి చూస్తే అటవీ అందాలతో పాటు నిండుకుండలా పోచారం ప్రాజెక్టు కనువిందు చేస్తుంది. అభయారణ్యంలోని వన్యప్రాణులను తిలకించేందుకు సఫారీ సౌకర్యం కల్పించారు. ఈ వాహనం ద్వారా నాలుగున్నర కిలోమీటర్ల మేర ఉన్న అడవిలో ఉండే వన్యప్రాణులను తిలకించవచ్చు. పిల్లలకు రూ. 50, పెద్దలకు రూ. 100 టికెట్‌తో వాహనంలో ఎక్కించుకుని అడవిలో తిప్పుతూ జంతువులను చూపిస్తారు. జంతువుల ఫొటోలు తీస్తే అదనపు చార్జి

మిగతా 7వ పేజీలో..





పోచారం అభయారణ్యం



సఫారీ రైడ్

ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్ర

- విద్యార్థులను అడ్డుపెట్టుకొని రాజకీయం
- తప్పు చేస్తే చట్ట పరమైన చర్యలు
- మంత్రి కొండా సురేఖ



హత్నూర గురుకుల విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ క్రాంతి

హత్నూర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు పని కట్టుకొని కుట్ర చేస్తున్నాయని సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వసతి గృహాల్లో ఎక్కడైనా చిన్నసంఘటన జరిగితే ప్రభుత్వంపై ఆరోపణలను మోపేందుకు ప్రతిపక్షాలు భూతద్దంలో చూపుతున్నాయని ఆరోపించారు. మండల కేంద్రమైన హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థులకు అందించే భోజన మెనూ చార్టును కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం హాస్టళ్లలో చదువుతున్న బాలికలు పౌష్టికాహారం అందించకపోవడంతో రక్తహీనతతో రోగాల బారినపడ్డారని ఆరోపించారు. మెస్‌చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో కాలం వెళ్లదీశారని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం గురుకుల పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందజేయడానికి భోజన, కాస్మెటిక్ చార్జీలను పెంచిందని చెప్పారు. విద్యార్థుల సంక్షేమం కోసం రూ. 470 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న సంకల్పంతో జిల్లాకు రెండు ఇంటిగ్రేటెడ్ వసతిగృహాలను మంజూరు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు వడ్డించేందుకు ముందు భోజనాన్ని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు తనిఖీ చేయాలని, ప్రతీరోజు మెనూ అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో రూ. 26కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో వసతులు కల్పించామని చెప్పారు. 146 సాంఘిక, సంక్షేమ హాస్టళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. గురుకులాల్లో అందించే ఐఐటీ, నీట్ కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం

మిగతా 6వ పేజీలో..

12,471 కేసులు పరిష్కారం



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

- ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్
- కక్షిదారుల మధ్య రాజీ
- సంగారెడ్డి జిల్లాలో 5,138, మెదక్‌లో 1,816, సిద్దిపేటలో 5,517 కేసులు

7



నకిలీ టీచర్లకు చెక్

- పాఠశాలల్లో టీచర్ల ఫొటోలు, వివరాల ప్రదర్శన
- సంగారెడ్డి జిల్లాలో 5 వేల మంది టీచర్లు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సర్కారు పాఠశాలల్లో టీచర్లు తమకు బదులుగా తాత్కాలిక సిబ్బందిని నియమించుకొని బోధిస్తున్నారనే విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సర్కారు బడుల్లో పనిచేసే ఉపాధ్యాయుల ఫొటోలు, వివరాలను ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులెందరు, ఏయే కేటగిరీ టీచర్లు పనిచేస్తున్నారనే విషయాలను ప్రదర్శించాల్సి ఉంటుంది. జిల్లాలోని నారాయణఖేడ్, కల్హేర్, కంగ్టి, జహీరాబాద్ తదితర మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయులు తమకు బదులుగా ఇతరులను నియమించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు ఉత్తర్వులతో పారదర్శకత ఏర్పడనుంది. తనిఖీకి వెళ్లిన ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు ఉపాధ్యాయుల సమగ్ర వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయుడు కాకుండా ఇతరులు బోధిస్తుంటే వెంటనే పసిగట్టి ప్రశ్నించే ఆస్కారం ఏర్పడుతుంది. కాగా, జిల్లాలో సుమారు 5 వేల మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు గ్రూప్-2 ఎంట్రెన్స్
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- అరగంట ముందే గేట్లు మూసివేత
- సంగారెడ్డి జిల్లాలో 41 కేంద్రాలు, 15,218 మంది అభ్యర్థులు
- మెదక్ జిల్లావ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలు, 5,855 మంది అభ్యర్థులు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నేడు, రేపు నిర్వహించనునన గ్రూప్-2 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు అభ్యర్థులకు అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం, మధ్యాహ్నం అరగంట ముందుగానే గేట్లు మూసేస్తారు. తర్వాత వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలో చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థుల వెంట గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదు. పరీక్ష నిర్వహణకు 8 మంది జాయింట్ రూట్ అధికారులు, ఐదు మంది ఫ్లైయింగ్ స్క్వాడ్ నియమించారు. సంగారెడ్డి జిల్లాలో 41 పరీక్ష కేంద్రాల్లో 15,218 మంది అభ్యర్థులు, మెదక్ జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాల్లో 5,855 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి

మెదక్ జిల్లాలో పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు వివిధ శాఖల అధికారులకు విధులు కేటాయించినందున, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.



సంగారెడ్డిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

'పీఎంశ్రీ' పాఠశాలలకు నిధులు మంజూరు

సంగారెడ్డి జిల్లాలో 25 పాఠశాలలకు రూ.73.32 లక్షలు కేటాయింపు

7



స్వాధీనం చేసుకున్న ఆల్ఫాజోలం

ఎక్సైజ్ దాడులు.. ఆల్ఫాజోలం పట్టివేత

- రూ.25 లక్షల విలువైన 2.5 కేజీలు స్వాధీనం
- ఒకరి అరెస్ట్, పరారీలో మరొకరు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణంలో పలుచోట్ల శుక్రవారం రాత్రి జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ మూర్తి ఆదేశానుసారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మర్ఫీ పర్యవేక్షణలో ఎక్సైజ్ సీఐ, డీటీఎఫ్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సిద్దిపేట అర్బన్ మండలం కృష్ణసాగర్ రోడ్డులో గడ్డమీద రాజుగౌడ్ నుంచి రూ.25 లక్షలు విలువ చేసే 2.5 కిలోల నిషేధిత మత్తు పదార్థం ఆల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మరో నిందితుడు మర్పల్లి అర్జున్‌గౌడ్ పరారీలో ఉన్నాడు. ఇంకో నిందితుడు చేపూరి నర్సింలుగౌడ్ బోధన్ జైల్లో వేరొక కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడు రాజుగౌడ్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సిద్దిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, డీటీఎఫ్‌సీ శ్రీధర్, ఎస్ఐలు సరిత విజయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బుకింగ్ కార్యాలయం వద్ద లేని షెడ్డు, ఎదురుగా కోనేరుకు వెళ్లే దారిలో మాత్రం ఏర్పాటు చేసిన షెడ్డు

నీడేది?

- మల్లన్న ఆలయ బుకింగ్ కార్యాలయం వద్ద ఎండలోనే బారులు
- భక్తులకు తప్పని ఇబ్బందులు
- జాతరలో తాత్కాలిక తడకల పందిరి ఏర్పాటుతో సరి
- కోనేరు వైపునకు వెళ్లే మార్గంలో మాత్రం షెడ్డు

చేర్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయానికి దర్శనార్థం వచ్చే భక్తులకు బుకింగ్ కార్యాలయ ఆవరణలో శాశ్వత ప్రాతిపదికన నిలువ నీడ ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిర్ధేశిత డబ్బు చెల్లించి మొక్కుబడి టికెట్లతో పాటు ప్రసాదాలు పొందడం కోసం ఎండలోనే నిలబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి చవిచూస్తున్నారు. ముఖమండప విస్తరణకు అనుగుణంగా లక్షలాది రూపాయలు వెచ్చించి బుకింగ్ కార్యాలయ భవనం నిర్మించినా ఆవరణలో మాత్రం భక్తులకు వీలుగా రేకుల షెడ్డు ఏర్పాటు చేయలేదు. మల్లన్న దర్శనార్థం నిత్యం 5-10 వేల మంది, జాతర వారాల్లో 60వేల నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలివస్తారు. మల్లన్నకు భక్తులు చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి మొక్కులు తీర్చుకుంటారు. అలాగే ఆర్జిత సేవలు నిర్వహించే వారు మరికొంత మంది ఉండటంతో పాటు ప్రసాదాలు పొందడానికి బుకింగ్ కార్యాలయ కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో సాధారణ రోజుల్లోనే కాకుండా మూడునెలల బ్రహ్మోత్సవాల సమయంలో కౌంటర్ వద్ద భారీగా బారులు తీరి గంటల తరబడి పడిగాపులు కాస్తారు. కౌంటర్లు, స్టీల్ బారీకేడింగ్ నెలకొల్పినప్పటికీ కేవలం జాతర మూడు నెలల కాలంలోనే తాత్కాలికంగా తడకల పందిరి వేస్తున్నారు. వేలాది రూపాయలు వృథా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. తద్వారా వర్షంతో పాటు ఎండకు భక్తులు తంటాలు పడుతున్నారు. కేవలం ఆదాయ సేకరణ కోసమే భవనాన్ని వినియోగించుకుంటున్నారంటూ ఆలయవర్గాల తీరుపై భక్తులు మండిపడుతున్నారు. స్వామి వారి దర్శనం చేసుకుని ఆరుబయటకు వచ్చే ఆవరణతో పాటు కోనేరు వైపునకు వెళ్లే మార్గంలో దాతల సహకారంతో చాన్నాళ్ల క్రితం షెడ్డు ఏర్పాటు చేశారు. కానీ ఆయా ప్రదేశాల మధ్యలో ఉన్న బుకింగ్ కార్యాలయ ఆవరణలో మాత్రం షెడ్డు నిర్మాణానికి పూనుకోవడం లేదు. దాసారంగుట్ట అప్రోచ్‌రోడ్డు, 50గదుల సత్ర భవన నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ అతీగతీలేదు. అయితే, కొద్దిపాటి వ్యయంతోనే భక్తులందరికీ ప్రయోజనం చేకూరే షెడ్డు నిర్మాణంపై దృష్టిసారించడం లేదు. గతేడాది ఆలయ సందర్శనార్థం వచ్చిన దేవాదాయశాఖ కమిషనర్ ఆలయ పరిధిలో తాత్కాలిక పందిళ్లంటూ ఉండకుండా శాశ్వత నీడ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా చర్యలు తీసుకోవడం లేదు. కొద్ది రోజుల్లో జాతర ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆలయాధికారులు నిద్రమత్తువీడి షెడ్డు ఏర్పాటు చేసి రక్షణ కల్పించడంతో పాటు మహిళలకు ప్రత్యేక కౌంటర్లు నెలకొల్పి ఇబ్బందులు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్ర

ఐదో పేజీ తరువాయి

చేసుకోవాలన్నారు. అంతకుముందు గురుకుల కళాశాలలోని స్టోర్ రూంను కలెక్టర్‌తో కలిసి మంత్రి తనిఖీ చేశారు. విద్యార్థులకు వండి పెట్టే సరుకులు నాసిరకంగా ఉండడంతో ప్రిన్సిపాల్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుకుల శాంపిల్ సేకరించి ఫుడ్‌సేఫ్టీ అధికారులతో పరీక్ష చేయించాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, గురుకుల విద్యాల సంస్థల రాష్ట్ర ఓఎస్డీ వివేకానంద, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంఈవో వెంకటనర్సింహులు, ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎంపీడీవో శంకర్, ప్రిన్సిపాల్ మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అర్బన్‌పార్కును అభివృద్ధి చేస్తాం



నర్సాపూర్ అర్బన్‌పార్కులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

నర్సాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అర్బన్ పార్కును ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని అర్బన్ పార్కును శనివారం ఆమె కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఎఫ్‌వో జోజి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి సందర్శించారు. పార్కులోని వాచ్‌టవర్ నుంచి అటవీ అందాలను వీక్షించారు. వాచ్‌టవర్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న అర్బన్‌పార్కును మరింతగా తీర్చిదిద్ది పర్యాటకులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. డీపీఆర్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇతర సదుపాయాలను కల్పించి త్వరలోనే ఇక్కడి కాటేజీలను అందుబాటులో తెస్తామన్నారు. ఈ పార్కులో చెక్‌డ్యాంలు, రాక్‌ఫిల్‌డ్యాం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. 685 మీటర్ల ట్రెక్కింగ్, 700 మీటర్ల సైక్లింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో నిర్వహించే ప్రజా మహాసభకు తరలిరండి

- గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జీవీ సూర్యకిరణ్ పిలుపు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15న సిద్దిపేట విపంచి కళా నిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పీపుల్స్ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలని ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జీవీ సూర్యకిరణ్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గద్దరన్న సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్తున్నామని, ప్రజలే గద్దరన్న వారసులన్నారు. అందులో భాగంగానే ఆదివారం ఉదయం పది గంటలకు సిద్దిపేట బైపాస్ రోడ్డులోని విపంచి కళా నిలలయంలో ప్రజా మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహా సభలో గద్దర్ రాసిన పాటల జీవకణం, తరగని గని, లష్కర్, అండర్ గ్రౌండ్ పుస్తకాలను ఆవిష్కరించనున్నామన్నారు. మహాసభకు అతిథిలుగా ఎమ్మెల్యే హరీశ్‌రావు, అల్లం నారాయణ, బక్కి వెంకటయ్య, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

గద్దరన్న రచించిన నాలుగు పుస్తకాల ఆవిష్కరణ

జగదేవ్‌పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న సిద్దిపేట విపంచి కళా నిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ప్రజా మహాసభలో గద్దరన్న రచించిన నాలుగు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తెలిపారు. శనివారం గద్దర్ ప్రజా మహాసభ కరపత్రాలను జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా మహాసభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

మూడు రోజుల పాటు ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్

సిద్దిపేట క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23, 24, 25వ తేదీల్లో మూడు రోజుల పాటు సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు మహాసభల స్వాగత సమితి చైర్మన్ తాటిపల్లి అశోక్ తెలిపారు. శనివారం ఆయన తన కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా మహాసభలను ప్రారంభిస్తారని తెలిపారు.

సెన్సార్ బోర్డు కేంద్ర సభ్యురాలిగా భవాని

మర్కుక్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సెన్సార్ బోర్డు కేంద్ర సభ్యురాలిగా కళ్లేపు భవాని నియమితులయ్యారు. శనివారం ఆమె మాట్లాడుతూ తనను బోర్డు సభ్యురాలిగా నియమించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సినిమాటోగ్రఫీ యాక్ట్‌ను పాటిస్తూ తనకు అప్పగించిన విధులు నిర్వహిస్తానన్నారు.

అండర్ 14 క్రికెట్ జట్టుకు పటాన్‌చెరు బాలుర ఎంపిక

పటాన్‌చెరు, డిసెంబరు, 14(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరుకు చెందిన ముగ్గురు బాలురు అండర్ 14 క్రికెట్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. పట్టణంలోని ఏపీఆర్ కాలనీలో నివాసం ఉండే శ్రీజన్‌రెడ్డి, ఎన్.సూరజ్‌ప్రసాద్ నాయక్ ఇటీవల నగరంలో నిర్వహించిన జిల్లా జట్టు సెలక్షన్‌లలో మెదక్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఇదే కాలనీకి చెందిన అద్వైత్‌రెడ్డి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

క్రైం కార్నర్

బైక్ ఢీకొని మహిళ మృతి

● అనాథలైన ఇద్దరు కుమారులు


రేణుక (ఫైల్)

మనోహరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన మండల పరిధిలో శనివారం ఉదయం రామాయపల్లి వద్ద చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయపల్లి గ్రామానికి చెందిన కటికల సత్తయ్య, రేణుకా దంపతులకు ఇద్దరు కుమారులు చరణ్ (16), రిషికేష్(14). తండ్రి సత్తయ్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. తల్లి రేణుక(38) రామాయపల్లి గ్రామ శివారులోని ఇండూస్ మెడికేర్ పరిశ్రమలో కార్మికురాలుగా పని చేసుకుంటు కుమారులను పోషిస్తున్నది. రోజులాగే శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో విధులకు బయలుదేరింది. రామాయపల్లి గ్రామంలోని 44 జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన సందీప్ బైక్‌తో ఢీకొట్టారు. దీంతో చుట్టు పక్కల వారి సమాచారం మేరకు కుటుంబీకులు ఆమెను వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రేణుక మృతి చెందిదని తెలిపారు. తల్లిదండ్రుల మృతితో వారి కుమారులు అనాథలై శోకసంద్రంలో మునిగిపోయారు. అల్లుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

● ముగ్గురికి గాయాలు


చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

కొండపాక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అతివేగంతో అజాగ్రత్తగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన కొండపాక శివారులో రాజీవ్ రహదారిపై శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై రోడ్డుకు అటువైపు దూసుకెళ్లి హైదరాబాద్ వైపు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టి చెట్ల పొదల్లో పడింది. స్కూటీపై ఉన్న శ్రీనివాస్, అశ్వినిలతో పాటుకారులో కారులో ప్రయాణిస్తున్న జితిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారులో మరో ముగ్గురు ఉన్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని హెచ్‌కేఆర్ అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

దుబ్బాక, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం దుబ్బాకలో చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామానికి చెందిన తిరుపతి(53) 23 ఏళ్ల క్రితం దుబ్బాకకు వలస వెళ్లాడు. తెలిసిన వారి వద్ద అప్పు చేసి గ్రామంలో ఇల్లును కొన్నాడు. అంతేకాకుండా దుబాయ్ నుంచి తిరిగి వచ్చాక అప్పుచేసి కోడిగుడ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో చేసిన అప్పులను తీర్చలేక రేపల్లె వార్డులో వ్యవసాయ పొలం వద్ద శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక రైతులు ఉరేసుకున్న విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాళ్లు, రప్పలతో సాగుకు యోగ్యంగా లేని భూములవి.. కూలీలతో తొలగింపజేసేందుకు ఖర్చు, శ్రమ ఎక్కువే.. ఎన్ని రోజులు పడుతుందో తేలీదు.. ఉన్నత ఉద్యోగాన్ని వదిలి తమ ప్రాంతంలోని ఈ బీడు భూములను సాగుకు యోగ్యంగా మార్చేందుకు ఓ యువకుడు కంకణం కట్టుకున్నాడు. మొదటి ప్రయత్నంలో విఫలమైనా.. వెనకడుగు వేయకుండా రాళ్లను ఏరివేసే యంత్రాన్ని ఆవిష్కరించి ఔరా అనిపించాడు. వినూత్నంగా ఆలోచించి, రైతులకు ఉపయోగపడే యంత్రాన్ని రూపొందించిన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన కొంగరి దీపక్‌రెడ్డిని అందరూ అభినందిస్తున్నారు.


దీపక్‌రెడ్డి రూపొందించిన రుద్ర యంత్రం

'రుద్ర యంత్రం'.. సాగు మంత్రం

రాళ్లను ఏరివేసే యంత్రాన్ని రూపొందించిన బోరంచ యువకుడు

● నాలుగు గంటల్లోనే ఎకరం భూమిలో రాళ్ల తొలగింపు
● ఖర్చు తక్కువ.. కూలీల అవసరం లేదు
● బీడు భూమలను సాగుకు యోగ్యంగా మారుస్తున్న యంత్రం

నారాయణఖేడ్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన కొంగరి దీపక్‌రెడ్డి బీటెక్ మెకానికల్ పూర్తి చేసి, ఏడాది పాటు ఉద్యోగం చేశాడు. అనంతరం ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామానికి చేరుకున్నాడు. దీపక్‌రెడ్డి కుటుంబం ఉమ్మడి కుటుంబంగా వ్యవసాయమే వారికి జీవనాధారం. దీపక్‌రెడ్డి తండ్రితో పాటు చిన్నాన్న, పెద్దనాన్నలు కలిపి ఆరుగురు ఉండగా, వారి కుటుంబసభ్యులే 50 మంది వరకు ఉంటారు. గ్రామంలో వీరి కుటుంబానికి 100 ఎకరాల వరకు భూమి ఉంది. అందులో 30 శాతం వరకే సాగు చేసేవారు. 70 శాతం రాళ్లు, రప్పలతో సాగుకు అనువుగా ఉండేది కాదు. ఇంత భూమి ఉన్న సాగు చేసేది కొద్ది మేరకే ఉండడంతో, దీపక్‌రెడ్డి ఎలాగైనా తమ భూమిని అధికశాతం సాగులోకి తీసుకురావాలనే ఆలోచించే వారు. భూమిలో రాళ్లు ఏరివేసే యంత్రాన్ని ఎలాగైనా తయారు చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. నారాయణఖేడ్‌లోని ఓ మిత్రుడి సామెల్ వద్ద కొద్దిపాటి స్థలాన్ని ఏర్పాటు చేసుకొని రాళ్లు ఏరివేసే యంత్రానికి రూపకల్పనకు శ్రీకారం చుట్టాడు.


రుద్రార్‌లోని పొలంలో రాళ్లను తీయకముందు.. రుద్ర యంత్రం ద్వారా రాళ్లను ఏరివేసిన అనంతరం దృశ్యాలు


గతంలో రాళ్లను ఏరుతున్న కూలీలు (ఫైల్)

మొదటి ప్రయత్నంలో విఫలం..

మొదటి ప్రయత్నంలో రూపొందించిన యంత్రం ఉపయోగంలోకి రాలేదు. అయినప్పటికీ దీపక్‌రెడ్డి నిరాశ చెందకుండా, మరో విధానంతో రాళ్లు ఏరివేసే యంత్రాన్ని తయారు చేసే పనిని మళ్లీ ప్రారంభించాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, ఇలాంటి ఆలోచనలతో సమయాన్ని వృథాగా చేసుకోకుండా చక్కగా ఉద్యోగం చేసుకోమని, ఒత్తిడి తెచ్చినప్పటికీ దీపక్‌రెడ్డి వెనుకడుగు వేయలేదు. తమ కుటుంబ భూమే కాకుండా నియోజకవర్గంలోని అధికశాతం భూములు ఇదే విధంగా ఉండడంతో ఎలాగైనా రాళ్లను ఏరివేసే యంత్రాన్ని కనుగొనాలనే లక్ష్యంతో ఏడాది పాటు శ్రమించాడు. చివరికి యంత్రాన్ని రూపొందించాడు.

ట్రాక్టర్ సహాయంతో పనిచేసేలా

ఈ యంత్రానికి రుద్రగా నామకరణం చేసి, ట్రాక్టర్ సహాయంతో వినియోగించేలా రూపొందించాడు. ఒక ఎకరాలో రాళ్లను తొలగించాలంటే 30 మంది కూలీలు అవసరము. దీంతో కూలీలకు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. అదే రుద్ర యంత్రం ద్వారా రాళ్లను తొలగిస్తే రూ.10వేల వరకు మాత్రమే ఖర్చు అవుతుంది. రుద్ర యంత్రం ఒక ఎకరంలో నాలుగు గంటల్లోనే పూర్తి స్థాయిలో ఏరి రాళ్లను వేస్తున్నది. ఈ యంత్రం సహాయంతో భూమి లోతు నుంచి కూడా రాళ్లను తొలగించగల్గుతున్నారు. దీంతో భూమి సాగుకు యోగ్యంగా మారుతుంది. రుద్ర యంత్రం పనితీరు విజయవంతం కావడంతో, వాటిని వినియోగించడానికి కూడా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రాళ్లు ఏరి వేసే యంత్రంతో భూమి సాగులోకి



నాకు ఐదు ఎకరాల వరకు భూమి ఉండగా, అందులో రెండు ఎకరాల భూమి రాళ్లు, రప్పలతో సాగుకు అనువుగా లేదు. దీంతో మూడు ఎకరాల్లో మాత్రమే సాగు చేసేవాడిని, దీపక్‌రెడ్డి రుద్ర యంత్రం ద్వారా రాళ్లు ఎరివేయిస్తున్నాడని తెలుసుకుని, నేను నా భూమిలో రాళ్లను ఏరివేయించాను. దీంతో ప్రస్తుతం ఐదు ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. ఈ యంత్రం లేకుంటే ఇప్పటికీ నారెండు ఎకరాల భూమి బీడుగా ఉండేది.

\- అజీమొద్దీన్, రైతు రుద్రారం

సాగులోకి తీసుకురావడానికే శ్రమించా



నేను బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. ఉద్యోగాన్ని వదిలి మా ప్రాంతంలోని బీడు భూములను సాగులోకి తీసుకువచ్చి, రైతుల వలసలను నివారించాలనుకున్నా. మా కుటుంబానికి చెందిన భూమి 70 శాతం రాళ్లు, రప్పలతో ఉండేది. ఈ సమస్య నా కుటుంబానిదే కాదు. నియోజకవర్గ రైతులందరిదీ. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా శ్రమించాను. మూడేళ్లు కృషి చేసి నేను అనుకున్న రుద్ర యంత్రాన్ని రూపొందించాను. ఇప్పటి వరకు 20 యంత్రాలను తయారు చేయించి, విక్రయించా. రుద్ర యంత్రాల ద్వారా దాదాపు 280 మంది రైతులకు సంబంధించి 600 ఎకరాల భూమి సాగులోకి వచ్చింది.

\- దీపక్‌రెడ్డి, రుద్ర యంత్రం రూపకర్త

రెండేళ్లుగా 20 యంత్రాలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రైతు పండుగ ఉత్సవాల్లో దీపక్‌రెడ్డి రుద్ర యంత్రం పనితీరును ప్రదర్శించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించిన రైతు ఉత్సవాల్లోను ఈ యంత్రంను ప్రదర్శించగా, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి యంత్రం పనితీరు చూసి దిపక్‌రెడ్డిని అభినందించారు. ఈ యంత్రాలకు ఆదరణ లభిస్తుండడంతో, రెండేళ్లుగా 20 వరకు రుద్ర యంత్రాలను తయారు చేసి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోను విక్రయించారు. యంత్రాలను తయారు చేయడానికి అవసరమైన ముడి సరుకుల ధరలను బట్టి ఒక్కో యంత్రాన్ని రూ.6.50 లక్షల నుంచి రూ.7.50 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఈ యంత్రాలను తయారు చేయడానికి ప్రభుత్వం తరఫున రూ.35 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో, ఇటీవల నారాయణఖేడ్‌లో దీపక్‌రెడ్డి, భౌమ్య ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీపక్‌రెడ్డి వద్ద 18 మంది వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన దీపక్‌రెడ్డి తండ్రి బోజిరెడ్డి న్యాయవాది, తల్లి నర్సమ్మ గృహిణి, సోదరుడు దిలీప్‌రెడ్డి న్యాయవాది, సోదరి కీర్తన బీటెక్ చదువుతుంది. అందరి లాగే బీటెక్ పూర్తి చేసిన దీపక్‌రెడ్డి ఉద్యోగానికే పరిమితం కాకుండా రుద్ర యంత్రం రూపకల్పనతో రాళ్ల భూములను రతనాల భూములుగా మారుస్తున్నాడు.

12,471 కేసుల పరిష్కారం

● ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్
● న్యాయాధికారుల సమక్షంలో కక్షిదారుల మధ్య రాజీ





కక్షిదారులకు అవార్డు కాపీని అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర, మెదక్‌లో ఇరువర్గాల కక్షిదారుల మధ్య కేసును పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్/సిద్దిపేట క్రైం, డిసెంబరు 14 : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆయా కోర్టు సముదాయాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో 12,471 కేసులను పరిష్కరించారు. న్యాయాధికారులు కక్షిదారుల మధ్య రాజీ కుదర్చి, బాధితులకు నష్టపరిహారాన్ని ఇప్పించి న్యాయం చేశారు. సంగారెడ్డి జిల్లాలో 5,138, మెదక్ జిల్లాలో 1816, సిద్దిపేట జిల్లాలో 5,517 కేసులు పరిష్కారమయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో ఏడు బెంచీలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏడు బెంచీలను ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలో మూడు, జోగిపేట, నారాయణఖేడ్‌లో ఒక్కటి చొప్పున, జహీరాబాద్‌లో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. 5138 కేసులు పరిష్కారం కాగా, ఇందులో క్రిమినల్ కాంపౌండేబుల్ 4656, సివిల్ 11, ప్రిలిటిగేషన్ కేసులు మూడు ఉన్నాయి. అలాగే మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు 16 పరిష్కరించి బాధితులకు రూ.99,66,000 పరిహారం అందజేశారు. 266 బ్యాంకు రికవరీ కేసులు పరిష్కరించడం ద్వారా రూ.1,90,11,500 మొత్తాన్ని బ్యాంకు అధికారులు రికవరీ చేశారు. సైబర్ క్రైమ్ కేసులు 103 పరిష్కరించి బాధితులకు రూ.10,43,343 అందజేశారు. 11 భూ సేకరణ కేసుల్లో రైతులకు రూ.14,66,68,025 పంపిణీ చేశారు. 72 విద్యుత్ చౌర్యం నిరోధక కేసుల్లో రూ.2లక్షలు వసూలు చేశారు. సంగారెడ్డి కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల వారికి సమన్యాయం, సత్వర న్యాయం అందుతుందన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులు గమనించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, న్యాయవాదుల సహకారంతో జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడానికి సాధ్యమైందని తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగకుండా, సమయం వృథా కాకుండా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సివిల్, కుటుంబ తగాదాలలో ఉన్న ఇరువర్గాల వారు రాజీ కుదుర్చుకొని, భవిష్యత్ లో ఎలాంటి తగవులు రాకుండా ఈ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి, కే.జయంతి, జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి జి సునీత రవీంద్ర రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి రమేష్, జిల్లా మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఎక్సైజ్ కోర్టు పి.తేజశ్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ప్రభు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయానికి లోక్ అదాలత్

లోక్ అదాలత్ ద్వారా అప్పీలుకు అవకాశం లేని అంతిమ తీర్పు పొందవచ్చని మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా న్యాయస్థానాల సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. సత్వర న్యాయం అందరికీ చేరువకావాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 1816 కేసులు పరిష్కరించబడాయని, ఈ కేసుల్లో రూ.108,33,727 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి సిరిసౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు, లీగల్ అథారిటీ సభ్యులు, సూపరింటెండెంట్ సుజాత పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో

క్షణికావేశంతో చేసిన తప్పులకు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ సరైన వేదికని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 5,480 క్రిమినల్ కేసులు, 27 క్రిమినల్ కేసులు, 10 మోటార్ ప్రమాద కేసులను పరిష్కరించారు. మోటార్ ప్రమాద కేసులలో బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ.1,09,95,000 అప్పగించారు. ప్రీ లిటికేషన్ కేసుల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 35 కేసులను పరిష్కరించి రూ.9,62,273, బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఒక కేసును పరిష్కరించి రూ.24,000 రికవరీ చేశారు.

'పీఎంశ్రీ' పాఠశాలలకు నిధులు మంజూరు

● 25 పాఠశాలలకు రూ.73.32 లక్షలు కేటాయింపు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) కింద ఎంపిక చేయబడిన సర్కారు బడులకు నిధులు మంజూరయ్యాయి. మొదటి విడతగా రూ.73,32,000 నిధులను మంజూరు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ రకాల వసతులు, సౌకర్యాల కల్పన కోసం ఈ నిధులు వినియోగించాల్సి ఉంటుంది. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా నిధులు మంజూరు చేశారు. మంజూరైన నిధులను ఎంపిక చేసిన 25 పాఠశాలల ఖాతాలో జమ చేశారు. ఈ నిధులను ఏయే వాటికి ఖర్చు చేయాలనే దానిపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది. తరగతి గదుల్లో ఎల్ఈడీ లైటింగ్, పెయింటింగ్, డస్ట్‌బిన్‌ల ఏర్పాటు, సదస్సుల నిర్వహణ, గ్రీన్ స్కూల్, వర్మి కంపోస్టింగ్, కిచెన్ అండ్ గార్డెనింగ్, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థులు ఫీల్డ్ విజిత్ తదితర అవసరాలకు ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. పీఎంశ్రీ కింద ఒక్కో పాఠశాలకు ఏడాదికి రూ.40 లక్షల చొప్పున ఐదేళ్లకుగాను రూ.2 కోట్లు నిధులు విడుదలవుతాయి. ఇందులో భాగంగా రెండో ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.73.32 లక్షలు విడుదల చేసింది.

ప్రకృతి రమణీయం.. పోచారం అభయారణ్యం

ఐదో పేజీ తరువాయి

వసూలు చేస్తారు. అభయారణ్యం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటుచేసిన పార్కులో పర్యాటకులు సేదతీరుతూ ఆహ్లాదాన్ని పొందుతుంటారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా పార్కులో ఊయలు, ఇతర ఆటవస్తువులున్నాయి. అభయారణ్యం పక్కనే పర్యాటకుల కోసం అందమైన విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. ఇందులో ఏర్పాటు చేసిన వన్యప్రాణుల చిత్రాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

ప్రాజెక్టు అందాలకు ఫిదా

అభయారణ్యం పక్కనే నిజాం కాలంలో నిర్మించిన పోచారం ప్రాజెక్టు అందాలకు పర్యాటకులు ఫిదా అవుతుంటారు. వర్షాకాలంలో ఈ డ్యాం అలుగు పారుతున్న సమయంలో జలపాతాన్ని తలపిస్తుంటుంది. ఈ దృశ్యాలను చూసేందుకు ప్రకృతి ప్రేమికులు పోటీపడుతుంటారు. యువతీ యువకులు, చిన్నా పెద్ద తేడాలేకుండా కుటుంబ సమేతంగా పర్యాటకులు ఎంజాయ్ చేస్తుంటారు.

కవులు ప్రజల పక్షాన నిలబడాలి

● తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 14 : కవులు నిరంతరం ప్రజల పక్షం నిలబడాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో డాక్టర్ ఉదారి నారాయణ కవిత్వం 'మళ్లీ మనిషిలోకి' పురస్కార ప్రదానం, స్వాతి దేవర 'స్వాతి చినుకులు' కవితా సంపుటి ఆవిష్కరణ, కవి సమ్మేళనం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలనా విధానాలలో మార్పులు జరుగడం సహజమని, ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా.. కవులు వర్తమాన పరిస్థితులను, ప్రజల శ్రేయస్సున మాత్రమే దృష్టిలో ఉంచుకొని కవిత్వం రాయాలని సూచించారు. దశాబ్ద కాలంగా వెన్నెల సాహితీ సంగమం ఎందరో కొత్త కవులను ప్రోత్సహిస్తూ సాహితీ ప్రపంచానికి పరిచయం చేయడం గొప్ప విషయమని డా. ఉదారి నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో వంగర నరసింహారెడ్డి, పర్కపెల్లి యాదగిరి, గాలిరెడ్డి, రామచంద్రరావు, మహమూద్ పాషా, అశోకరాజు, స్రవంతిమహిపాల్, పిడిశెట్టిరాజు కవులు, రచయితలు పాల్గొన్నారు.


స్వాతి చినుకులు కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న కవులు



ఖేడ్ గిరిజన బాలుర గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పక్కన ఆర్డీవో అశోకచక్రవర్తి



మెదక్ అర్బన్: మెదక్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



నర్సాపూర్ గిరిజన బాలుర గురుకులంలో మెనూ చార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గురుకుల పాఠశాలల్లో కొత్త డైట్ ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన డైట్ మెనూ కార్యక్రమాన్ని గురుకుల పాఠశాల్లో శనివారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, రోహిత్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



నారాయణపూర్ గిరిజన బాలికల సంక్షేమ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఆర్డీఏ పీడీ



సంగారెడ్డిలోని బీసీ గురుకుల పాఠశాలలో మెనూ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఎస్‌వో, స్పెషల్ ఆఫీసర్ ఖాసీంబేగ్



పటాన్‌చెరు : మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ చార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

నేడు దేవునిపల్లి మల్లన్న గుట్ట జాతర

కల్హేర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మాసాన్‌పల్లి, దేవునిపల్లి గ్రామాల పరిధిలో వెలసిన దేవునిగుట్ట మల్లన్న స్వామి జాతర ఆదివారం జరగనున్నది. గుట్టపై గుహలో వెలసిన మల్లన్నస్వామికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకుంటారు. ఈ జాతర సందర్భంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన, మరుసటి రోజు మాసాన్‌పల్లి గ్రామంలో జాతరను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మెలో మాట్లాడుతున్న లక్ష్మణ్

సంగారెడ్డి రూరల్/సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహులు, రాహుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు శనివారం మద్దతు తెలిపారు. అలాగే సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు టీపీటీఎఫ్ మునిపల్లి శాఖ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ మునిపల్లి మండలాధ్యక్షుడు నీలి లక్ష్మణ్ మాట్లాడారు. అనంతరం సమ్మె నిర్వాహకులకు టీపీటీఎఫ్ మండల శాఖ తరఫున రూ.2 వేలు ఆర్థిక సహాయం చేశారు. కాగా సమ్మెకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ మాదవ్, తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాథోడ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, ప్రధాన కార్యదర్శి అనిల్‌చారి, శేషాద్రి పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం జరగొద్దు

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



హత్నూరలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

హత్నూర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం మండల కేంద్రమైన హత్నూరలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం ప్రత్యేక ఆప్‌ను రూపొందించిందన్నారు. ఈ అప్లికేషన్ ఆధారంగా ప్రజాపాలన దరఖాస్తుదారులందరి ఇళ్లకు ఇన్యుమరేటర్లు వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు.

పోలీసులకు ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకం

● సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 14 : పోలీసుశాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ చాలా కీలకమని సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నాడు సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కానిస్టేబుళ్లకు వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని, శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలమని పేర్కొన్నారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి: టీడబ్ల్యూజేఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని, జర్నలిస్టుల మీద దాడులు జరగకుండా రక్షణ చట్టం తేవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం యూనియన్ సంగారెడ్డి డివిజన్ అధ్యక్షుడు ఎస్.రాజుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూనియన్‌లో ఉన్న నాయకులు, సభ్యులు నిరాశ చెందకుండా ఐక్యంగా ఉంటూ మన యూనియన్‌ను మళ్లీ పునర్నిర్మించుకుందామని అన్నారు. జిల్లాలో ఇళ్లస్థలాలు, అక్రిడిటేషన్, హెల్త్‌కార్డులు ఇతర సమస్యలను పోరాడి సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సరేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాండు, సంగారెడ్డి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజుగౌడ్, రాజు, సభ్యులు దండు ప్రభు, శౌకత్, బాల్‌రాజ్, శరత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను రోడ్డున పడేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

వర్గల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలంలో టీజీఐఐసీ కోసం రైతుల వద్ద నుంచి బలవంతంగా భూసేకరణ చేసి పూర్తి స్థాయిలో పరిహారం అందించకుండా రైతులను రోడ్డున పడేసిన ఘనత అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొన్నాల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం వర్గల్ కేంద్రంలో రైతులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు దీక్ష చేస్తున్నప్పుడు రాని బీఆర్‌ఎస్ నాయకులు, ఇప్పుడు అండగా ఉంటామని నమ్మబలుకుతూ రైతుల వద్దకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. పరిశ్రమలు నిర్మాణం జరుగుతున్న టీజీఐఐసీ భూముల వద్ద రైతులు చేస్తున్న దీక్ష వద్దకు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లను పిలిపించి రైతులకు ప్లాట్లతో పాటు రూ.1.10లక్షలు ఇచ్చే విధంగా నర్సారెడ్డి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కిషన్‌గౌడ్, ఎల్లయ్య, నర్సారెడ్డి, చింటూ, అశోక్, వెంకట్ యాదవ్, రైతులు యాదయ్య, శివయ్య, చిందం కిష్టయ్య, నరసయ్య, మల్లయ్య నర్సింహులు, సత్తయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట'

కంగ్టి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కంగ్టిలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చినా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలుచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాయబ్ తహసీల్దార్ జుబేర్, సీడీసీ చైర్మన్ శాదుల్, నాయకులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను నాశనం చేసింది కాంగ్రెస్సే: మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థను నాశనం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో 70 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేయలేదన్నారు. టీడీపీ హయాంలో ఎన్టీఆర్ నియోజకవర్గంలో రెండు గురుకులాలను ఏర్పాటు చేయగా, బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ 8 గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. గురుకులాల నిర్వహణ చేతగాక బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు ముజమ్మిల్, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, అంజాగౌడ్ పాల్గొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



లేగదూడను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

హవేళిఘణపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పశువుల పాకలో కట్టేసిన లేగదూడను చిరుతపులి చంపేసిన ఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం బొగుడ భూపతిపూర్ శివారులో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన వంకాయల సాయిలు వ్యవసాయంతో పాటు పశువులు పెంచుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం రోజు మాదిరిగానే శివారులోని తన పొలం వద్ద పశువులను కొట్టంలో కట్టేసి రాగా చిరుతపులి దాడిచేసి లేగదూడను చంపిందన్నారు. సమాచారమందుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి హరినాయక్ పరిశీలించి, మాట్లాడారు. గాజిరెడ్డిపల్లి, భూర్గుపల్లి, బొగుడ భూపతిపూర్, జక్కన్నపేట, శాలిపేట, పోచారం ఫారెస్ట్ సమీప ప్రజలు చిరుతపులి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

నర్సాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ సమీపంలోని పీర్లగుట్టపై ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నించారు. సర్వే నంబరు 76లో 50 ఎకరాలకు పైగా ప్రభుత్వం భూమి ఉంటుంది. అది ఎత్తైన ప్రదేశంలో గుట్టలాగా ఉండగా.. ఈ మధ్య కొందరు కొంతభాగం చదును చేస్తున్నారు. పైగా అటువైపు నివాస స్థలాలు లేకున్నా వాహనాలు వచ్చేటట్టు రోడ్లు కూడా ఏర్పాటు చేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయం తహసీల్దార్ శ్రీనివాస్ దృష్టికి వెళ్లడంతో ఆర్ఐతో పాటు ఇతర సిబ్బందిని అక్కడికి పంపించి విచారించినట్లు తెలిసింది. త్వరలో పీర్లగుట్ట వద్ద ఉర్సు ఉత్సవాలు జరగనున్నందున చదును చేస్తున్నట్లు కొందరు తెలిపారని, జాతర ముగిసిన తర్వాత పనులు జరిగితే బోర్డు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.



పీర్లగుట్టపై చదును చేసిన ప్రభుత్వ భూమి

వైభవంగా దత్తాత్రేయ జయంతి



పెద్దశంకరంపేటలోని మాణిక్యప్రభు మందిరంలో దత్త జయంతిలో భక్తులు

మెదక్ అర్బన్/పెద్దశంకరంపేట/కల్హేర్/తూప్రాన్/మనోహరాబాద్/నారాయణఖేడ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మెదక్ దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్తాత్రేయ జయంతి నిర్వహించారు. జిల్లా కేంద్రం బ్రాహ్మణవీధిలోని దత్తాత్రేయస్వామి, ప్రాచీన శివాలయంలోని ఆలయాల్లో జయంతి శోభ కనిపించింది. ఇందులో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొని పూజలు చేశారు. పెద్దశంకరంపేటలోని మాణిక్య ప్రభు, సంతోషిమాత ఆలయంలో శనివారం దత్త జయంతి నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించిన అన్నారం సత్యనారాయణ, ఆర్‌ఎం.దశరత్‌లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. మండల కేంద్రమైన కల్హేర్, మండల పరిధిలోని ఇందిరానగర్ గ్రామాల్లోని దత్తాత్రేయ మందిరాల్లో దత్త జయంతి నిర్వహించారు. కల్హేర్‌లోని దత్తాత్రేయ మందిరంలో జరిగిన ఉత్సవాల్లో దత్తుడి పుట్టుక నిర్వహించి డోలారోహణం చేశారు. ఇందిరానగర్‌లోని నవనాథుల మందిరంలో ఏక్‌నాథ్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తూప్రాన్ పట్టణంలో దత్త జయంతిని నిర్వహించారు. పట్టణంలో శ్రీబాలంజనేయస్వామి ఆలయంలో దేవీ ఉపాసకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, పూజ, డోలోత్సవం, భిక్షా నిర్వహించారు. తూప్రాన్ గీతా మందిరంలో రాత్రి దత్తాత్రేయస్వామి దివ్యపాదుకాభిషేకం, భజన నిర్వహించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో దత్తాత్రేయస్వామి జయంతి నిర్వహించారు. మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్ దంపతులు హాజరై పూజలు, హోమాలు చేశారు. ఆనందగిరి మహరాజ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఖేడ్ మండల పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆలయంలో దత్తజయంతి నిర్వహించారు. నారాయణఖేడ్ ప్రాంత భక్తులే కాకుండా సరిహద్దు జిల్లాల భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీస్సులు అందించారు.

ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా మారుస్తా

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట/మెదక్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రసిద్ధిచెందిన ఏడుపాయల పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మారుస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం ఆయన వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడుపాయల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందగా సీఎం రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పార్శి నర్సింహులు పాల్గొన్నారు. అలాగే మెదక్ సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ వేడుకల్లో మెదక్ డయాసిస్‌కు చెందిన 13 జిల్లాల పాస్టర్లు పాల్గొన్నారు. చర్చి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు కావడానికి కృషిచేసిన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ, పాస్టర్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్ అవారి శేఖర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి అంబులెన్స్‌ను కేటాయించండి

● మంత్రికి కాంగ్రెస్ నాయకుల విన్నపం



కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని నర్సాపూర్ నియోజకవర్గ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శివ్వంపేట మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, రమేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్ నాయకులు నర్సాపూర్ అర్బన్ పార్క్ సందర్శనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. జూనియర్ కళాశాల భవనం, కస్తూర్బా గాంధీ గిరిజన పాఠశాలలో డ్రైనేజీ, శివ్వంపేట పెద్ద చెరువు కట్టపై సీసీరోడ్డు, మినీ ట్యాంక్ బండ్, శిథిలావస్థకు చేరిన పోలీసుల క్వార్టర్స్, భగలాముఖి ఆలయంలోకి సీసీరోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మండలాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఇందులో మాజీ జడ్పీటీసీ కమల పూల్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు

● ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా

నారాయణఖేడ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల వినియోగం, వాడకాన్ని అరికట్టడం కోసం శనివారం మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు దుకాణాలు, వ్యాపారసంస్థలపై మున్సిపల్ సిబ్బంది మెరుపు దాడులు చేశారు. దుకాణాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు.

గానుగాపూర్‌కు ప్రత్యేక బస్సులు



ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న డీఎం జాకీర్‌హుస్సేన్

జహీరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ డిపో నుంచి గానుగాపూర్‌కు దత్తపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని జహీరాబాద్ ఆర్టీసీ డిపోమేనేజర్ జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. గానుగాపూర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సును శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణీకులకు ఆర్టీసీ సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. శనివారం, ఆదివారం బస్సులను నడిపిస్తున్నామన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

చిన్నశంకరంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవనశాఖ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ రంగనాయకులు అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని మదూర్ గ్రామంలో రైతు కుమార్‌గౌడ్ పది ఎకరాల పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలను సాగు చేస్తున్నాడు. శనివారం ఉద్యానవన శాఖ అధికారులు సందర్శించి మొక్కలను పరిశీలించారు.

'కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోండి'

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని పారిశ్రామికవాడల్లో కొన్ని పరిశ్రమలు కాలుష్య రసాయనాలను బోర్వెల్ ద్వారా రివర్స్ పంపింగ్ చేసి పూర్తిగా భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీరు మంజీరా జలాలు, చెరువుల్లో చేరి చేపలు, చెరువులో నీటిని తాగిన మూగజీవాలు మృతిచెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంజీరా నదిని కలుషితం చేస్తున్న కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి: తపస్

చేగుంట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ డీఏ, బకాయిలను చెల్లించాలని తపస్ జిల్లా ప్రధన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ అన్నారు. శనివారం చేగుంట మండల వనరుల కేంద్రం వద్ద ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేశం, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, తపస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దత్తయజ్ఞ కార్యక్రమాలు

ఝరాసంగం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో గల దత్తగిరి ఆశ్రమంలో శనివారం దత్తయజ్ఞ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కర్ణాటకతోపాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ఆశ్రమంలోని నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆశ్రమపీఠాధిపతి వైరాగ్యశిఖామణి అవదూతగిరి మహరాజ్, బావిపీఠాధిపతి డా.సిద్ధయ్యస్వామిభక్తులకు ఏర్పాట్లు చేశారు.

వసతి గృహాల్లో అధికారుల తనిఖీ

కంగ్టి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని బీసీ బాలుర వసతి గృహంతోపాటు తడ్కల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాలను శనివారం ఎంఈవో రహీమొద్దీన్, నాయబ్ తహసీల్దార్ జుబేర్, ఎంపీవో సుభాష్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చాకరిమెట్ల ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణస్వామి మండపంలో వ్రతాలను ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, పూజారులు భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పాపన్నపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లికి చెందిన మెతుకు గేదె గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి మృతిచెందింది. గేదె విలువ రూ.95 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.